ఎడతెరిపిలేని వర్షం


బుక్కపట్నం వద్ద నేలకొరిగిన వరి పంట


వర్షపు నీరు హంద్రీ-నీవా కాలువలోకి పోతుండటంతో ఖాళీగా కనిపిస్తున్న గూనిపల్లి చెరువు



ధర్మవరం మండలం నడిమిగడ్డపల్లిలో దెబ్బతిన్న ద్రాక్ష తోట


- పలు మండలాల్లో దంచికొట్టిన వాన
- పొంగి పొర్లిన వాగులు, వంకలు, చెరువులు
- పలు చోట్ల వాహనాల రాకపోకలకు అంతరాయం

పుట్టపర్తి/ బత్తలపల్లి/ ఓడీచెరువు/ తాడిమర్రి: పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, రాప్తాడు నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు ఎడతెరిపిలేకుండా వర్షం కురిసింది. వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు చోట్ల పంట పొలాలు నీట మునిగాయి. బుక్కపట్నం, కొత్తచెరువు మండలాల్లో చేతికొచ్చిన 210 ఎకరాల్లోని వరి మళ్లు నేలకొరిగాయి. ఇవి కాక వేరుశనగ, మొక్క జొన్న, కూరగాయల పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు.

ఆ చెరువులకు నీరు చేరే దారేదీ?

బుక్కపట్నం మండలం సిద్దరాంపురం, గూనిపల్లి చెరువుల్లోకి వచ్చిన వర్షపు నీరు కాస్తా హంద్రీ-నీవా కాలువ పాలైంది. సమీప కొండల్లోంచి వర్షపు నీరు చెరువులకు చేరినపుడు మరువ పారేది. అయితే హంద్రీ-నీవా కాలువ నిర్మాణ సమయంలో ఇంజినీరింగ్ అధికారులు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ఈ చెరువుల్లో నీరు నిలిచే పరిస్థితి లేకుండాపోయింది. కాలువ అవతల సిద్దరాంపురం చెరువు ఉంది. కాలువ మీదుగా చెరువుకు నీళ్ల పోయేందుకు ఏర్పాటు చేసిన బ్రిడ్జి నిర్మాణంలో లోపం జరిగింది. దీంతో వర్షపునీరు హంద్రీ-నీవా కాలువ దాటి చెరువులోకి చేరడం లేదు. ఇక గూనిపల్లి చెరువుది మరో రకమైన సమస్య. ఎగువన గూనిపల్లి చెరువు ఉండటంతో వర్షపునీరు వచ్చినా.. తిరిగి దిగువన ఉన్న హంద్రీ-నీవా కాలువలోకి వెళ్లిపోతోంది. ఈ రెండు చెరువుల కింద ఎకరాల ఆయకట్టు ఉంది. చెరువుల్లో నీరు లేకపోవడంతో బీడు పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందించి సాంకేతికతను వినియోగించి చెరువుల్లోకి నీరు చేరి నిల్వ ఉండేలా చర్యలు చేపట్టాలని గూనిపల్లి సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, రైతులు గంగాధర్, కేశవప్ప తదితరులు కోరుతున్నారు.


ఓడీ చెరువు మండలం సున్నంపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న సోమావతినది


సిద్దరాంపురం చెరువుకు చేరకుండా హంద్రీ-నీవా కాలువలోకి వెళ్తున్న వర్షపు నీరు


బత్తలపల్లి మండలంలోని చిత్రావతి నదిలో గంగపూజ చేస్తున్న తహసీల్దార్ స్వర్ణలత

చిత్రావతి నీరు ఉప్పర్లపల్లి చెరువుకు మళ్లింపు

బత్తలపల్లి మండలంలోని చిత్రావతి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో సంగమేశ్వరక్షేత్రం వద్ద ఉప్పర్లపల్లి చెరువుకు వెళ్లే కాలువ ద్వారా చిత్రావతి నది నీటిని అధికారులు మళ్లించారు. చిత్రావతి నది నీరు జ్వాలాపురం, కోడేకండ్ల, రామాపురం మీదుగా ఉప్పర్లపల్లి చెరువుకు నీరు చేరుతుంది. గతంలో ఈ కాలువ ద్వారా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పలు దఫాలు నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి చిత్రావతి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో తహసీల్దార్ స్వర్ణలత, ఇరిగేషన్ ఏఈ నాగభవ్య, స్థానిక నేతలు ఉప్పర్లపల్లి చెరువుకు వెళ్లే కాలువ తూము గేట్‌ను ఎత్తి నీటిని విడుదల చేశారు. అంతకు ముందు మండలంలోని పలు ప్రాంతాలలో వాగులు, చిత్రావతి నది పరివాహక ప్రాంతాల్లో వారు పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. చిత్రావతి నదిలో గంగపూజ చేశారు.

పొంగిన వాగులు వంకలు

ఓడీచెరువు మండలంలో కురిసిన భారీ వర్షాలకు సోమావతి నది, వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఎగువన ఉన్న బోయపల్లి, గౌరాపురం, చౌడేపల్లి చెరువులు నిండి మరువ పారడంతో వరద ఉధృతి పెరిగి ఓడీచెరువు – హిందూపురం జాతీయ రహదారిలో సున్నంపల్లి మధ్యన గల వంతెనతెగి రాకపోకలు నిలిచిపోయాయి. వంతెనకు ఆవలి వైపున ఉన్న సున్నంపల్లి, మలకవారిపల్లి, పెద్దగుట్లపల్లి మీదుగా కర్ణాటకకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలిసిన ఓడీచెరువు ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి తెగిన వంతెన దగ్గరకు ప్రజలు వెళ్లకుండా తాత్కలికంగా కంచె ఏర్పాటు చేశారు .

తాడిమర్రి మండలంలో ఓ మోస్తరు వర్షం

తాడిమర్రి, మోదుగులకుంట, చిల్లకొండయ్యపల్లి, పెద్దకోట్ల, ఎం.అగ్రహారం, ఆత్మకూరు, నిడిగల్లు, నార్శింపల్లి, పిన్నదరి తదితర గ్రామాల్లో మంగళవారం తెల్లవారు జామున ఓ మోస్తరు వర్షం కురిసింది. 56.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌ఓ సౌమ్య తెలిపారు. దీంతో భూగర్భజలాలు పెరుగుతాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొట్టుకుపోయిన కాజ్‌వే

పుట్టపర్తిరూరల్: పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని రాయలవారిపల్లికి చిత్రావతి నదిపై ఉన్న తాత్కాలిక కాజ్‌వే సోమవారం కురిసిన భారీవర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. చిత్రావతి నదిపై నిర్మిస్తున్న 342 హైవేకు సంబంధించిన బ్రిడ్జీలు త్వరితగతిన పూర్తి చేయాలని, అప్పడే గ్రామానికి శాశ్వతంగా రహదారి సమస్య పరిష్కారం అవుతుందని గ్రామస్తులు కోరుతున్నారు.

మగ్గం గుంతల్లోకి వర్షపు నీరు



ధర్మవరం అర్బన్: ధర్మవరం పట్టణంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి అపార నష్టం వాటిల్లింది. పలు వార్డుల్లోని మగ్గం గుంతల్లో వర్షపునీరు చేరింది. దీంతో మగ్గాలన్నీ పూర్తిగా తడిసిపోయాయి. కేతిరెడ్డికాలనీ ఎల్1, ఎల్2, ఎల్3 కాలనీలకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన రైల్వే అండర్ బ్రిడ్జి కింద వర్షపునీరు నిలబడడంతో రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. కేశవనగర్, మాధవనగర్, ఇందిరమ్మకాలనీ, కేతిరెడ్డి కాలనీలలో భారీ వర్షం కారణంగా మగ్గాలన్నీ నీట మునిగాయి. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని చేనేత కార్మికులు కోరుతున్నారు. ధర్మవరం చెరువు మరువ ఉధృతంగా ప్రవహిస్తోంది. మరువను చూసేందుకు పట్టణవాసులు పెద్ద ఎత్తున చెరువు వద్దకు చేరుకున్నారు. దుర్గానగర్‌లో భారీ వర్షానికి విద్యుత్ స్తంభం కూలిపోయింది. దీంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. సత్యసాయినగర్‌లో ఇళ్ల మధ్య వర్షపునీరు నిలబడి ప్రజలంతా ఇబ్బందులు పడ్డారు.


ఓడీ చెరువు మండలం సున్నంపల్లి వద్ద తెగిన వంతెన


కాజ్‌వేపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

క్లుప్తంగా

నిండుకుండలా 'పెడబల్లి జలాశయం'


మరువ పారుతున్న పెడబల్లి జలాశయం

ఎన్‌పీకుంట: పెడబల్లి వద్ద పాపాఘ్ని నదిపై నిర్మించిన జలాశయం నిండుకుండను తలపిస్తోంది. కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు భారీగా వరద వచ్చి చేరుతుండటంతో పెడబల్లి జలాశయానికి జలకళ సంతరించుకుంది. జలాశయం నీటి సామర్థ్యం 0.134 టీఎంసీలు కాగా పూర్తి స్థాయిలో నిండి మరువ పారుతోంది. తహసీల్దార్ నరేంద్రకుమార్ మంగళవారం జలాశయాన్ని సందర్శించి మరువ ఉధృతిని పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల వారు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

బ్రిడ్జి నిర్మాణం చేపట్టండి

ఎన్‌పీకుంట: గోపాలపురం నుంచి ఎగువపల్లి వెళ్లే దారిలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఎగువపల్లి గ్రామస్తులు కోరారు. గ్రామానికి వెళ్లే రహదారిలో నిర్మించిన బ్రిడ్జి మరమ్మతులకు గురై వర్షాలు పడినపుడల్లా రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. గతంలో వర్షాలు పడినప్పుడు మట్టి తోలి తాత్కాలిక మరమ్మతులు చేపట్టినట్లు గుర్తు చేశారు. ప్రస్తుత వర్షాలకు ఆ మట్టి కొట్టుకుపోయిందన్నారు. దీంతో తామే మట్టి తోలుకొని జేసీబీతో చదును చేసుకున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి నూతనంగా బ్రిడ్జి నిర్మించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు.

ప్రైవేట్ పాఠశాలల అధ్యక్షుడిగా ఆదిశేషారెడ్డి



తనకల్లు: కదిరి డివిజన్ ప్రైవేట్ పాఠశాలల నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా ఆదిశేషారెడ్డి, ఉపాధ్యక్షులుగా అమానుల్లా, కార్యదర్శిగా మధుసూదన్ రెడ్డి, కోశాధికారిగా కార్తీక్ ఎనఇనకయ్యారు. ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.

క్రీడల్లోనూ రాణించండి


విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్పెక్టర్ భానుమూర్తి

కదిరి అర్బన్: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని రాష్ట్ర ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్పెక్టర్ భానుమూర్తి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన కదిరిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో రాణించిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల సంఖ్య దాదాపు 1500 ఉన్నందున సమగ్ర శిక్ష తరఫున రైఫిల్ షూటింగ్, ఆర్చరీ, టేబుల్ టెన్నిస్ మెటీరియల్ మంజూరుకు అనుమతి ఇప్పిస్తామని చెప్పారు.

పోలీసుల పాత్రపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

ధర్మవరం అర్బన్: శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర ఎలా ఉంటుందో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు సీఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ధర్మవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పోలీస్‌స్టేషన్‌లోని వీహెచ్‌ఎఫ్ సెట్‌ను ఎలా ఉపయోగించాలి, టెక్నాలజీ సాయంతో కేసులు ఛేదించడంపై విద్యార్థులకు వివరించారు. 'నేటి బాలలే రేపటి పౌరులు' అంశంపై సీఐ స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు.

'ఇండీ గ్యాప్'పై అవగాహన

ఎన్‌పీకుంట: వెలిచలమల రైతుసేవ కేంద్రంలో మంగళవారం ఇండీ గ్యాప్ ధ్రువీకరణ పథకంపై రైతులకు ఏడీఏ సత్యనారాయణ, ఎక్స్టర్నల్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ ఎస్.రవి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ లోకేశ్వరరెడ్డి, టెక్నికల్ అడ్వైజర్ లక్ష్మీప్రియ, రైతుసేవ కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట

బత్తలపల్లి: మండల కేంద్రంలోని చెరువు వద్ద నూతనంగా నిర్మించిన ఆలయంలో మంగళవారం గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు మండల వంశీకులు(వాల్మీకులు) ఆధ్వర్యంలో వేదపండితులు మంజునాథశర్మ బృందంచే నిర్వహించారు.

హమాలీ మృతి

గాండ్లపెంట: మండల కేంద్రంలోని పౌరసరఫరాల గిడ్డంగిలో హమాలీగా పనిచేసే సోమయాజులపల్లికి చెందిన రామాంజులు (40) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. అంత్యక్రియల నిమిత్తం పౌరసరఫరాల శాఖ తరఫున స్టాకిస్ట్ వెంకటేష్ రూ.20వేల నగదును హమాలీ భార్యకు అందజేశారు.

కనగానపల్లిలో భారీ వర్షం


కనగానపల్లిలో భారీ వర్షానికి తెగిన చెరువు కట్ట

కనగానపల్లి: మండలంలో సోమవారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. సుమారు 20 సెం.మీ. రికార్డు వర్షపాతం నమోదైంది. కనగానపల్లి చెరువు కట్ట తెగిపోవటంతో ఆయకట్టు కింద ఉన్న వంద ఎకరాల్లో వరిమడి దెబ్బతింది. సమీపంలో ఉన్న బీసీ కాలనీలోకి నీరు చేరింది. కుర్లపల్లి, మామిళ్లపల్లి గ్రామాల్లో వర్షాలకు వేరుశనగ కొట్టుకుపోవటంతో పాటు కంది, ఆముదం పంటలు నేలకొరిగాయి. ముక్తాపురం చెరువు మరువ నీరు జాతీయ రహదారిపై ప్రవహించింది. పక్కన ఉన్న ఒక పెట్రోల్ బంక్ నీట మునిగింది. దాదులూరులో పోతలయ్యస్వామి ముందు పెద్ద వంక భారీగా ప్రవహించి గుడి తలుపుల వరకు నీరు చేరింది. కనగానపల్లి సమీపంలోని పండమేరు వంక కూడా భారీగా ప్రవహించింది. వర్షానికి దెబ్బతిన్న పంటలను, చెరువులను ఎమ్మెల్యే పరిటాల సునీతతో పాటు జిల్లా రైతు సంఘం నాయకులు పరిశీలించారు. వీరితో పాటు తహసీల్దార్ రమాదేవి, ఏఓ క్రిష్ణకుమారి పరిశీలించారు.

కుమ్మేసిన వాన


వర్షానికి మృతి చెందిన ఆవు

చెన్నేకొత్తపల్లి: మండల వ్యాప్తంగా సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారు జామున వరకు భారీ వర్షం కురిసింది. చెన్నేకొత్తపల్లి నుంచి వెంకటంపల్లి దారిలో వంక ఉధృతంగా ప్రవహించింది. వెల్దుర్తి, చిన్నపురెడ్డిపల్లి వద్ద చిత్రావతి నది ప్రవాహం అధికంగా ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. ధర్మవరం పుట్టపర్తి రహదారిపై ఆమిదాలకుంట వద్ద వంకపేరు ఉధృతికి వాహనాల రాకపోకలు స్తంభించాయి. కనుముక్కలలో రాజారెడ్డి అనే రైతుకు చెందిన పాడి ఆవు మృతి చెందగా, గ్రామంలో లోతట్టు ప్రాంతంలోని ఇళ్లు జలమయమయ్యాయి. ఈ ప్రాంతాలను చెన్నేకొత్తపల్లి తహశీల్దార్ సురేష్‌కుమార్ పరిశీలించారు. చిత్రావతి, వంగపేరు వాగుల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పర్యవేక్షించారు. ముష్టికోవెల, న్యామద్దెల చెరువుల మరువలు పారుతున్నాయి. హరియాన్ చెరువు పరిసర ప్రాంతంలో మరువనీటికి దాదాపు 60 ఎకరాల్లో వరి పంట నీట మునిగిందని రైతులు వాపోయారు. అలాగే 10 ఎకరాల్లో టమాట నీట మునగగా, 20 ఎకరాల్లో వేరుశనగ పంట తడిసిపోయినట్లు రైతులు తెలిపారు.

మరువ పారిన చెరువులు


రామగిరి: వర్షానికి కొట్టుకుపోయిన అక్కంపల్లి - పోలేపల్లి దారి

రామగిరి: మండలంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో పోలేపల్లి, రామగిరి, కుంటిమద్ది, గంతిమర్రి చెరువులు మరువ పారాయి. మండలవ్యాప్తంగా 190 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. కుంటిమద్దిలో ఇళ్లలోకి వర్షపునీరు చేరింది. పోలేపల్లి, అక్కంపల్లిలో నారాయణ, చంద్రశేఖర్, జనార్దన్, క్రిష్ణమూర్తికి చెందిన 300 బస్తాల వేరుశనగ మొత్తం వర్షపు నీరు కొట్టుకుపోయింది. దాదాపు రూ.10 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. పలు గ్రామాల్లో రైతులు సాగుచేసిన వివిధ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రామగిరి చెరువు మరువ పారడంతో వాహనాల రాకపోకలను అధికారులు నిలుపుదలను చేశారు. ఎమ్మెల్యే పరిటాల సునీత వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు.

'చిత్రావతి' సమీప ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


సీబీఆర్‌లోకి వస్తున్న వరదనీటి గురించి తెలుసుకుంటున్న ఎస్‌ఐ

తాడిమర్రి: మండల పరిధిలోని చిత్రావతి నది సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ నాగస్వామి హెచ్చరించారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు చితాత్రవతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్)లోకి భారీగా వరద వస్తోంది. ఎస్‌ఐ నాగస్వామి సిబ్బందితో వెళ్లి సీబీఆర్ ప్రస్తుత పరిస్థితి గురించి ఈఈ రాజశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. సీబీఆర్‌లో ప్రస్తుతం 8 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు. క్రమేణా 9 టీఎంసీలు దాటే అవకాశం ఉండటంతో బుధవారం ఉదయం డ్యామ్ క్లస్టర్ గేట్లు ఎత్తి దిగువకు (నదికి) నీరు విడుదల చేయాల్సి ఉంటుందన్నారు. దీంతో ఎస్‌ఐ దాడితోట, తురకవారిపల్లి, నాయనపల్లి తదితర గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. డ్యామ్ గేట్లు ఎత్తి నదికి నీరు విడుదల చేస్తుండటంతో చిత్రావతి నదీ ప్రవాహం అధికంగా ఉంటుందన్నారు. పారుతున్న నదిలోకి దిగితే కొట్టుకుపోయే ప్రమాదం ఉందన్నారు. నదిలో మోటర్లు, పైపులు ఉన్నా, నది సమీపంలో మోటర్లు, పైపులు, డ్రిప్పు తదితర వ్యవసాయ పరికరాలు ఉంటే తొలగించుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో డీఈ దివాకర్, కానిస్టేబుల్ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

రుణాల కోసం ఆందోళన

తనకల్లు: కులవృత్తిలో శిక్షణ పొందిన తమకు రుణాలు మంజూరు చేయాలని పలువురు మంగళవారం కొక్కంటిక్రాస్‌లోని యూనియన్ బ్యాంక్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వకర్మ యోజనలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సామాజికవర్గాలకు చెందిన తాము స్కిల్ డెవలప్‌మెంట్ కింద మూడు నెలల క్రితం కులవృత్తులలో శిక్షణ పొందామన్నారు. వడ్డీ లేకుండా లక్ష రూపాయల దాకా రుణం పొందేందుకు తాము అర్హులని పేర్కొన్నారు. యూనియన్ బ్యాంక్ అధికారులు రుణాలు మంజూరు చేసే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. బ్యాంక్ సిబ్బంది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆందోళనకారులు శాంతించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు తోపు పారేసు, ప్రసాద్‌నాయక్ పాల్గొన్నారు.

జీవనోపాధి దెబ్బతీసేందుకు కుట్ర


శ్రీరామిరెడ్డి ఏర్పాటు చేసుకున్న బంక్

సాక్షి టాస్క్‌ఫోర్స్: చిల్లరకొట్టు ద్వారా జీవనోపాధి పొందేందుకు గ్రామనత్తం స్థలంలో ఏర్పాటు చేసుకున్న రేకులతో కూడిన బంకును ఎత్తివేయించేందుకు టీడీపీ నాయకులు కుట్ర పన్నుతున్నారు. కొత్తచెరువు మండలం తలమర్లలో వైఎస్సార్‌సీపీకి చెందిన శ్రీరామిరెడ్డి నాలుగు నెలల కిందట ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు పక్కన గ్రామ నత్తం స్థలంలో ఓ చిన్న బంక్ వేసుకున్నాడు. అందులో చిల్లర వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాగానే టీడీపీ నాయకులు ఎలాగైనా ఆ బంకు తొలగించి, ఆర్థికమూలాలపై దెబ్బ కొట్టాలని పథకం వేశారు. బంకు ఎత్తివేయించేందుకు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ద్వారా తహసీల్దార్, ఎంపీడీఓలపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. తాను అపరిశుభ్రంగా ఉన్న స్థలాన్ని శుభ్రం చేయించి, బంకు వేసుకునేందుకు రూ.లక్షల్లో ఖర్చయ్యిందని, ఇప్పుడు దాన్ని తొలగించి, జీవనోపాధి దెబ్బ తీయాలని చూస్తే కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మహత్య చేసుకోవడం తప్ప మరోదారి లేదని శ్రీరామిరెడ్డి వాపోతున్నాడు.

మెకానిక్ ఆత్మహత్యాయత్నం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లోనికోటకు చెందిన మెకానిక్ బాబా ఫకృద్దీన్ అప్పులబాధ భరించలేక మంగళవారం అధిక మోతాదులో మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు గమనించి వెంటనే అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి పంపారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆముదంలో పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి: అప్రాచెరువు గ్రామంలో మంగళవారం మండల గణాంకాధికారి డాక్టర్ కేఎస్ లక్ష్మీనరసింహశర్మ ఆధ్వర్యంలో ఆముదం పంటకోత ప్రయోగాలు చేపట్టారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

ధర్మవరం రూరల్: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడినట్లు ఎంపీడీఓ సాయి మనోహర్ తెలిపారు. మండలంలో అధిక వర్షాలు కురిసి చెరువులు మరువలు పారుతుండడంతో రవాణా సౌకర్యం లేనందున సమావేశాన్ని వాయిదా వేసినట్లు వివరించారు. తదుపరి సమావేశం తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

రైతుకు పాము కాటు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని చిన్నూరు గ్రామానికి చెందిన రైతు ఒసూరప్ప మంగళవారం పొలం వద్దకు నడుచుకుంటూ వెళుతుండగా అక్కమ్మ దేవాలయం సమీపంలో పాము కాటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఒసూరప్పను ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

సంక్షిప్త వార్తలు

రీసర్వేపై 12 వినతులు

తలుపుల : ఉడమలకుర్తిలో తహసీల్దార్ రెడ్డిశేఖర్ అధ్యక్షతన మంగళవారం రీసర్వేపై గ్రామ సభ నిర్వహించారు. వివిధ భూసమస్యల పరిష్కారం కోసం 12 వినతులు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు.

దుప్పట్ల పంపిణీ

నల్లచెరువు: అరుణోదయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగమల్లు ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ రఘునాథ గుప్తా, ఎస్‌ఐ మక్బూల్ బాషా, హెచ్‌ఎం విజయలక్ష్మి హాజరయ్యారు.

నూతన బలిజ సంరక్షణ సమితి కమిటీ ఎన్నిక

ముదిగుబ్బ: బలిజ సంరక్షణ సమితి మండల నూతన కమిటీని బలిజ కులస్తులు మంగళవారం ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా కావేటి అశోక్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా పెనుగోలు నరేష్, సెక్రటరీగా హరికుమార్, జాయింట్ సెక్రటరీగా సురేష్, కోశాధికారి నారాయణస్వామి, గౌరవాధ్యక్షులుగా డేగల వెంకట్, గౌరవ ఉపాధ్యక్షులుగా గుర్రం కరుణాకర్, సలహాదారులుగా బొగ్గు రాజశేఖర్, డేగల కిషోర్, గుర్రం జయచంద్ర, కోన చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా మల్లేపల్లి కిషోర్, హరి, రామస్వామి, మల్లికార్జున, పసుపులేటి గుణశేఖర్, జయశంకర్, గుణశేఖర్, రెడ్డప్ప, కులదీప్, బత్తిన అశోక్‌ను ఎన్నుకున్నారు.

దాతల సహకారంతో భోజన వసతి

ధర్మవరం: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు దాతల సహకారంతో మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి, కళాశాల చైర్మన్ బండి వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం 450 మంది విద్యార్థినులకు స్వయంగా వారు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఇద్దరు డాక్టర్లకు మెమో

కదిరి అర్బన్: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు డాక్టర్లకు డీఎంహెచ్‌ఓ మంజువాణి మెమో జారీ చేశారు. పట్నం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ప్రమీల, డాక్టర్ వినోద్ విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదని ఇటీవల నిర్వహించిన 'పల్లె పండుగ'లో ఎమ్మెల్యేకు పలువురు ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగేంద్రనాయక్‌ను డీఎంహెచ్‌ఓ ఆదేశించారు. విచారణ నివేదిక మేరకు ఇద్దరు డాక్టర్లనూ మంగళవారం పుట్టపర్తిలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి పిలిపించి మెమో జారీ చేసినట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు.

వెల్ఫేర్ అసిస్టెంట్‌కు మెమో

నల్లచెరువు: ఈ నెల 15న విధులకు డుమ్మా కొట్టిన నల్లచెరువు సచివాలయం-2 వెల్ఫేర్ అసిస్టెంట్ విజయకాంత్‌రెడ్డికి అధికారులు క్రమశిక్షణా చర్యల కింద మంగళవారం మెమో ఇచ్చారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి


బదిలీపై వెళ్తున్న ఆర్ఐను సన్మానిస్తున్న ఎస్పీ

పుట్టపర్తి టౌన్: పోలీసులు అంకితభావంతో విధులు నిర్వర్తించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ రత్న సూచించారు. బదిలీపై వెళ్తున్న ఆర్ఐ చంద్రశేఖర్‌కు మంగళవారం పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎస్పీ హాజరై సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు.

హోంగార్డు కుటుంబానికి చెక్కు పంపిణీ

కొత్తచెరువు మండలం యర్రపల్లికి చెందిన హోంగార్డు చెన్నప్ప జూలై 15న అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు జిల్లాలోని హోంగార్డులు ముందుకొచ్చారు. వారి ఒక రోజు వేతనం రూ 4,35,000ను చెక్కు రూపంలో హోంగార్డు భార్య చంద్రకళకు ఎస్పీ రత్న చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఎస్పీ సీఐ విజయకుమార్, డీసీఆర్‌డీ సీఐలు తిమ్మారెడ్డి, శ్రీనివాసులు, ఆర్ఐ వలి తదితరులు పాల్గొన్నారు.